క్లుప్తంగా

కూలిన ట్రాన్స్‌ఫార్మర్



కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫారం, గద్దె

మోమిన్‌పేట: ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టేందుకు నిర్మించిన రాతి కట్టడం కూలిపోయి ట్రాన్స్‌ఫారం కిందపడిపోయింది. దీంతో ఎన్కేపల్లి వ్యవసాయ బావులకు, గ్రామానికి సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫారం పిల్లర్‌ను పునర్నిర్మాణం చేపట్టి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాలుగేళ్లయింది.. పర్మినెంట్ చేయండి



కేక్ కట్‌చేసి తినిపించుకుంటున్న కార్యదర్శులు

దౌల్తాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ పూర్తయి నాలుగేళ్లవుతుందని, కావున రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీపీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్యదర్శులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో అనంతగిరిగుట్టలో ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి శిలాఫలకాలను ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రి పర్యటన ఉన్నందున అక్కడి వైద్య బృందంతో మాట్లాడి పలు సూచనలు చేశారు. గుట్టకు వెళ్లే మార్గంలో రోడ్డు దెబ్బతిన్నందున.. వేస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతగిరిలో కొనసాగుతున్న ఆశల శిక్షణా తరగతులను సందర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు' పేదల జీవితాల్లో వెలుగు



వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ నీరజారెడ్డి

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని కొత్తపల్లి సర్పంచ్ నీరజ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్నవారు నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ శరభలింగం, సూపర్‌వైజర్ కళమ్మ, ఏఎన్ఎం పుష్పలత పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ.. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ రాజిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయానికి వెళ్లే సీసీరోడ్డు పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు, పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాటు, ఇంటింటికీ తాగునీరు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వీధిలో సీసీరోడ్లు నిర్మించి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన స్వయం ఉపాధి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరుద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఉద్యోగ నియామకాలు లేవు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు. స్వయం ఉపాధి కోసమైనా ఆసరాగా ఉంటుందని బీసీ నిరుద్యోగులు.. బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఆరేళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంటే వాటికీ.. అతీగతి లేక ఎదురుచూస్తున్నారు.

- పెండింగ్‌లో కార్పొరేషన్ రుణాలు
- ఆరేళ్లు అవుతున్నా అందని డబ్బులు
- బీసీ నిరుద్యోగుల ఎదురుచూపు



కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయం

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పథకంలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు సంవత్సరాలు అవుతోంది. కానీ ఇప్పటి వరకు ఆ రుణాల ఊసే లేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే రుణాలు వస్తాయని లబ్ధిదారులు భావించారు. కానీ.. ముందస్తు ఎన్నికలతో ప్రక్రియ ఆగిపోయింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావడంతో రుణాల పంపిణీ నిలిచిపోయింది. తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ వచ్చింది. అనంతరం పార్లమెంట్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రావడంతో రుణాల పంపిణీ ఆగిపోయింది.

మోక్షం ఎప్పుడో?

ఇప్పుడు 2023 సాధారణ ఎన్నికలకు పాలకులు సిద్ధం అవుతున్నారు. ఓట్లు, అధికారం మీద ఉన్న ధ్యాస.. నిరుద్యోగులపై లేదని విద్యావంతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామానికి ఒకరిద్దరిని ఎంపిక చేసి రూ.50వేలు, రూ.లక్షలోపు ఉన్న కొంతమందికి చెక్కులు ఇచ్చారు. పూర్తి స్థాయిలో ఇప్పటి వరకూ ఇవ్వలేదు. స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఇవ్వాల్సిన రుణాలు పెండింగ్‌లో ఉండగా.. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని గతంలో నిర్ణయించింది. 2015–16 ఆర్థిక సంవత్సరం మొదలుకొని 2017–18 వరకు దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇవ్వాల్సి ఉంది. బీసీ యువకులకు స్వయం ఉపాధికి మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలను అందజేస్తామని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. అధికారులు తగిన చొరవ తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రుణాలు ఇవ్వాలి

బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకంలో భాగంగా రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. గతంలో ఇవ్వాల్సిన రుణాలు పలు కారణాల వలన పెండింగ్‌లో పెట్టారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని నిరుద్యోగులకు న్యాయం చేయాలి. సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి.

– మంగలి రమేష్, కొడంగల్

చదువుపై నిర్లక్ష్యం తగదు

- ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలి
- ప్రధానోపాధ్యాయురాలు సుమలత



డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తున్న చైల్డ్‌లైన్ అధికారులు

కుల్కచర్ల: చదువు పట్ల విద్యార్థులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత చెప్పారు. మల్కాపూర్‌కు చెందిన వడ్డె మల్లేశ్, హరికుమార్, ప్రశాంత్ అనే చిన్నారులు బడి మానేయడంతో కొందరు 1098కు సమాచారం ఇచ్చారు. ఆ సమాచారం మేరకు బుధవారం గ్రామానికి వెళ్లిన చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య స్థానిక సీఆర్పీ విజయ్‌కుమార్‌తో కలిసి గ్రామంలో డ్రాపౌట్స్ విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, తగిన సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో జరుగుతున్న మంచిచెడుల గూర్చి అవగాహన వస్తుందని చెప్పారు. ప్రభుత్వాలు అందించే పథకాలను పొందేందుకు అవసరమైన కనీసం విషయ పరిజ్ఞానం కూడా ఒక్క విద్య వల్లే వస్తుందని తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సూచనలు చేస్తున్న సీహెచ్ఓ చంద్రప్రకాష్

కుల్కచర్ల: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ చెప్పారు. బుధవారం ఇప్పాయిపల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాలు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండడంతో పాటు.. సుఖప్రసవం జరుగుతుందని తెలిపారు. ఐరన్ లోపించడం, రక్తహీనత తదితర సమస్యల నుంచి బయటపడాలంటే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీ దోషులను శిక్షించాలి

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి..
నిరుద్యోగులను కాపాడాలి: వైఎస్ఆర్‌టీపీ



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు

పరిగి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు కొళ్ల యాదయ్య, నరేందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేపట్టాలన్నారు. పేపర్ల లీకేజీతో రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగులు ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోయారు. నిందితులకు ప్రభుత్వం అండగా నిలిచి.. వారిపై నామమాత్రపు చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. నిరుద్యోగుల తరఫున తమపార్టీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందన్నారు. పదో తరగతి పేపర్ల వ్యవహారంపై 24 గంటల్లో స్పందించిన ప్రభుత్వం.. టీఎస్‌పీఎస్సీ విషయంలో ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అంతా అవినీతే జరుగుతోందని విమర్శించారు. గతంలో ఇంటర్ బోర్డు తప్పిదం వలన ఎంతో మంది విద్యార్థులు బలయ్యారని, ఇప్పుడు టీఎస్‌పీఎస్సీ వలన నిరుద్యోగులు రోడ్డున పడాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాకబ్, యాదగిరి, నగేష్, అఖిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

మోమిన్‌పేట: గురువారం మర్పల్లిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ కోరారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. కావున కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోమిన్‌పేట నుంచి 1000 బైకులతో మర్పల్లి వరకు ర్యాలీ ఉంటుందని, ప్రతి ఒక్కరు పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వెంకట్ కోరారు.

సర్వసభ్య సమావేశం నేడు

కుల్కచర్ల: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించడం జరుగుతుందని కుల్కచర్ల ఎంపీడీఓ నాగవేణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామని, ఈ సమీక్షకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కావున అధికారులు తమ శాఖాపరమైన సమాచారంతో సమావేశానికి రావాలని ఆమె సూచించారు.

'మనబడి' పనులు త్వరగా పూర్తి చేయాలి

తాండూరు రూరల్: మనఊరు–మనబడి పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని జినుగుర్తి, మల్కాపూర్, కోట బాసుపల్లి పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మనఊరు–మనబడి కింద ఎంపికైన పాఠశాలలను సందర్శిస్తున్నానని చెప్పారు. సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. రూ.కోటిలోపు పనులు టెండర్లు కాకుండా.. ఎస్ఎంసీ తీర్మానంతో స్థానిక సర్పంచులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను కాపాడుకోవాలి

ధారూరు: మహనీయుల చరిత్ర, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు దళిత బహుజనులు పోరాటం చేయాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మహనీయులు జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ధారూరు అంబేడ్కర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు తమ స్వార్థం కోసం ఏకంగా రాజ్యాంగాన్నే మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు మహిపాల్, శ్రీనివాస్, నర్సింహులు, సంగమేశ్, వెంకటయ్య, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

దోమ: బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని ఆ పార్టీ పరిగి తాలూకా ఇన్‌చార్జి చందు ముదిరాజ్ అన్నారు. బుధవారం పరిగికి చెందిన గండు రాజేశ్వర్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేశ్వర్‌ను శాలువతో సన్మానించారు. అనంతరం చందు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతం దిశగా ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పరిగి తాలూకా మహిళా కన్వీనర్ యాదమ్మ ముదిరాజ్, మండల అధ్యక్షుడు మల్లన్న, పరిగి మండల అధ్యక్షుడు ధన్‌రాజ్, మండల సెక్టార్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, పూడూర్ సెక్టార్ కమిటీ అధ్యక్షుడు విజయ్, నేతలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం



ఏపీఎంకు సమ్మె నోటీసు ఇస్తున్న వీఓఏలు

సమస్యలు పరిష్కరించేంత వరకు
పోరాటం: వీఓఏలు

పరిగి: వీఓఏలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు అంజలి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వీఓఏల సమ్మె నోటీసును ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డికి అందజేసి మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పనికి తగిన వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు యాదమ్మ, లావణ్య పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: మహిళా సంఘాల్లో పని చేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలకు నెలకు జీతం రూ.18 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీపా, అశోక్, కృష్ణ, వెంకటయ్య, యూసుఫ్, శివరాజ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మహిళకు మార్కెట్ కమిటీ పగ్గాలు

ఖరారు చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పగ్గాలు ఎస్టీ మహిళకు దక్కాయి. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములునాయక్ భార్య శాంతిబాయి పేరును రెండు రోజుల క్రితం తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో ఎస్సీ జనరల్‌కు ఉండడంతో.. మండల కేంద్రానికి చెందిన రాజరత్నం.. ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో శాంతికి పదవీ వరించనుంది. అయితే మొదట్లో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు సూచించిన వారికే పదవి దక్కుతుందని ప్రచారం జరిగినప్పటికీ.. చివరకు ఆయన సూచించిన మంతన్‌గౌడ్‌కు చెందిన ధన్‌సింగ్ భార్య కవిత పేరును కనీసం పరిశీలనకు కూడా తీసుకోకుండానే శాంతిని ఎంపిక చేసినట్లు సమాచారం. అలాగే వైస్ చైర్మన్‌గా మంతట్టి గ్రామానికి చెందిన బీసీ నాయకుడు కృష్ణ పేరును ఖరారు చేశారు. మొదట జీవన్గికి చెందిన దస్తయ్యగౌడ్‌కు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. అది నెరవేరలేదు. దీంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డైరెక్టర్ల స్థానాలు కూడా దాదాపు పూర్తి అయ్యాయి. వీరి పేర్ల ఆమోదం కోసం ప్రభుత్వానికి సిఫారసు లేఖ ఇప్పటికే పంపించారు. వారం రోజుల్లో అధికారికంగా నామినేటెడ్ పదవులు ప్రకటించనున్నారు.

బొంపల్లిలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

దోమ: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు.. ప్రజల మధ్య ఆత్మీయతను పెంచుతాయని ఎంపీటీసీ రాములు అన్నారు. బుధవారం బొంపల్లి మసీద్‌లో ముస్లింలకు ఎంపీటీసీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వమత సారం, మనుషులంతా ఒక్కటేనని, సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు చంద్రశేఖర్, షఫీ, బాబర్, మోహిన్, షేర్‌ఖాన్, హైమద్, ఫరీద్, రియాజ్, అక్రమ్, ఖయ్యూమ్, రహీం, డాక్టర్ యూసుఫ్, గ్రామస్తులు శ్రీనివాస్, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అధికారులు శాఖల వారీగా అంశాలను సభలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచులు ప్రస్తావించారు. గ్రామాల్లో రైతులు ధరణి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించే వీలులేక ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే కలెక్టర్ కార్యాలయం నుంచి రావాల్సిందే అని చెబుతున్నారని, రైతులు కలెక్టర్ కార్యాలయానికి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ధరణిలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యలపై అందరు కలిసి మెలిసి పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామాల్లో ప్రజలకు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులు మండలానికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తూ సహకరిస్తుందని చెప్పారు. మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈఈ జగన్‌రెడ్డి, ఎంఈఓ అక్బర్, సీడీపీఓ శోభారాణి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తట్టేపల్లి మండల సాధనే లక్ష్యం



దీక్షలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

పెద్దేముల్: అభివృద్ధిలో వెనుకబడిన పెద్దేముల్ మండలం తట్టేపల్లి జీపీని ప్రభుత్వం మండలంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని మండల సాధన కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారంతో దీక్ష 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి కనీస వైద్య సౌకర్యాలు లేక సమీపాన ఉన్న కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి కలిగిందన్నారు. అందుకే తట్టేపల్లిని మండలముగా ప్రకటిస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఊరూరా 'బలగం' షో



హస్నాబాద్‌లో.. బలగం చిత్రం ప్రదర్శన

మోమిన్‌పేట: గ్రామగ్రామాన 'బలగం' సినిమాను స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్నారు. మానవీయ కోణంలో తీసిన ఈ చిత్రానికి పల్లెల్లో విశేష ఆదరణ లభిస్తోంది. అన్నదమ్ముల మధ్య అనురాగం, ఆప్యాయతలపై ఆద్యంతం కొనసాగిన చిత్రం సనివేశాలను చూసిన ప్రేక్షకులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. దీంతో చిన్నచిన్న తగాదాలతో విడిపోయి ఒంటరిగా మిగలడం కంటే.. ఉన్నంతకాలం కలిసుండి సంతోషంగా ఉండాలని చిత్రం చూసిన ప్రజలను ఆలోచింపజేయడం గమనార్హం.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: విశేషంగా ఆదరణ పొందుతున్న బలగం చిత్రాన్ని మండలంలోని హస్నాబాద్, కస్తూర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి ప్రదర్శించారు. ఆత్మీయత, అనురాగాలు, అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపించిన సినిమాను చూసిన ప్రేక్షకులు.. ఉచితంగా ప్రదర్శించడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హస్నాబాద్ సర్పంచ్ ఫకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి.. రాయితీ పొందండి



పన్ను చెల్లిస్తున్న కౌన్సిలర్ సంగీత

తాండూరు టౌన్: ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ బుధవారం చెప్పారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించడం వలన మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈనెల 30వ తేదీ లోగా పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తోందని వెల్లడించారు. ఈ సదవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకుని, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం తన ఇంటిపన్నును ముందస్తుగా చెల్లించి, రాయితీ పొందారు.

మూగజీవాల దాహార్తి తీరుద్దాం

బషీరాబాద్: మూగజీవాల దాహం తీర్చడానికి ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జెడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. వేసవి కారణంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు అడుగంటి పోతున్నాయని, దీంతో తాగడానికి నీరులేక మూగజీవాలు అల్లాడుతాయని తెలిపారు. గతంలో పలు గ్రామాల్లో తాగడానికి నీరు దొరకక కొన్ని పశువులు చనిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో నీటి తొట్లు ఉన్నాయని, వాటిని జీపీ సిబ్బంది నీటితో నింపి ఉంచాలని సూచించారు. ఇళ్లపైన పిచ్చుకలకు నీరు ఉంచాలన్నారు. మూగజీవాల పట్ల ఆదరణ చూపాలని, వాటిని హింసించవద్దని విజ్ఞప్తి చేశారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

బంట్వారం: మండల పరిధిలోని బొప్పునారం యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన తిరుమలరాజు బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలంటూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశం, ఎస్ఎంసీ చైర్మన్ మహేందర్, గ్రామస్తులు నర్సింహులు, అశోక్, రాజు, అలీ తదితరులు పాల్గొన్నారు.